సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



బట్టేల్‌గుట్ట.. చరిత్ర పుట్ట

బడా జంగ్‌పేట్ అంటే నైజాం సిద్ధ సైన్యం ఉండే స్థావరం అని అర్థం.. చుట్టూ 30 అడుగుల ఎత్తులో కోట గోడ నిర్మించారు. 10లో▸



ప్రయోగాత్మక విద్యకే పెద్దపీట

ప్రయోగాత్మక విద్య ద్వారా సృజనాత్మకత మెరుగుపడుతుందని ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. 10లో▸



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జిల్లా స్థాయి అండర్ - 16, -18 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు సరూర్‌నగర్ స్టేడియంలో ఉత్సహంగా సాగుతున్నాయి. 10లో▸

న్యూస్‌రీల్

రేషన్‌దుకాణం సీజ్



రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో ఉన్న రేషన్‌దుకాణంలో గురువారం సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌దుకాణాన్ని బినామీ వ్యక్తి నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించిన అధికారులు దుకాణాన్ని సీజ్ చేశారు. లక్ష్మారెడ్డి అనే వ్యక్తికి ఈ రేషన్ దుకాణం కేటాయించగా పాషా అనే వ్యక్తి రేషన్‌దుకాణ నిర్వహిస్తున్నాడని, దీంతో డీలర్ లక్ష్మారెడ్డిని తొలగించడంతో పాటు దుకాణాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దుకాణాన్ని కిషన్‌నగర్ డీలర్ శివకుమార్‌కు కేటాయించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ పరంజ్యోతి, డీటీ నస్రుల్లాఖాన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్ పాల్గొన్నారు.

జేసీబీ పల్టీ.. డ్రైవర్‌కు గాయాలు



కాగజ్‌ఘాట్‌లో పల్టీకొట్టిన జేసీబీ

మంచాల: మండలంలోని కాగజ్‌ఘాట్ గ్రానైట్ క్వారీ వద్ద గురువారం జేసీబీ పల్టీ కొట్టింది. కొన్ని రోజులుగా కాగజ్‌ఘాట్ గ్రామంలో మల్లెన్‌గుట్టకు అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ తవ్వకాలలో భాగంగా గుట్టపై నుంచి జేసీబీ పల్టీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామని సీఐ వెంకటేశం తెలిపారు.

25,26 తేదీల్లో మెగా జాబ్ ఫెయిర్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో జేఎన్‌టీయూ క్యాంపస్‌లో జరిగే జాబ్ ఫెయిర్‌లో ఐటీ, కోర్, నాన్ ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో దేశ, విదేశాల్లో పేరొందిన సుమారు 262 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా జాబ్ ఫెయిర్‌లో పాల్గొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

కొత్త డీసీపీలకు పీఏల కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కమిషనరేట్ పునర్ విభజన నేపథ్యంలో కొత్తగా రెండు జోన్లు వస్తున్న విషయం విదితమే. వీటితో పాటు డివిజన్లు, ఠాణాలు అధికారికంగా ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికే సౌత్ వెస్ట్ జోన్‌కు ఖారె కిరణ్ ప్రభాకర్, సౌత్ ఈస్ట్ జోన్‌కు చెన్నూరి రూపేష్‌లను డీసీపీలుగా నియమించారు. వీరికి పీఏలను సైతం కేటాయిస్తూ కొత్వాల్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. సౌత్ ఈస్ట్ డీసీపీకి మీర్జా ఇమ్రాన్ ఖాన్, సౌత్ వెస్ట్ డీసీపీకి టి.వినీత్ కుమార్ పీఏలుగా నియమితులయ్యారు. సౌత్ జోన్‌లో పని చేస్తున్న కె.అనిల్ రెడ్డిని సెంట్రల్ జోన్ డీసీపీ పీఏగా బదిలీ చేస్తూ మంగళవారమే ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ పీఏలు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన ప్రీబిడ్ సమావేశాలు

అమ్మకానికి 38 ల్యాండ్ పార్సిల్స్

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 21 నుంచి వరుసగా మూడు రోజుల పాటు జరిగిన ప్రీ బిడ్ సమావేశాలు గురువారం ముగిశాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 5 ల్యాండ్ పార్సిల్స్‌పై ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ప్రీబిడ్ మీటింగ్ జరిగింది. హెచ్‌ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గంగాధర్, మేడిపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, హెచ్‌ఎండీఏ డీఏవో శోభారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామారావు, ఎమ్మెస్టీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లాలో 10, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5, సంగారెడ్డి జిల్లాలో 23 ల్యాండ్ పార్సిల్స్ కొనుగోలుదారులు కోసం సిద్ధంగా ఉన్నాయి. గండిపేట మండలంలో 3, శేరిలింగంపల్లి 5, ఇబ్రహీంపట్నం మండలంలో 2 చొప్పున అమ్మకానికి ఉన్నాయి. మేడిపల్లి 4, ఘట్‌కేసర్ 1, అమీన్‌పూర్ 16, ఆర్‌సీపురం 6, జిన్నారం మండలంలో 1 చొప్పున విక్రయించనున్నారు. మార్చి 1న ఈ మొత్తం 38 ల్యాండ్ పార్సిల్స్‌ను ఎమ్మెస్టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు చేపట్టింది.

భౌబోయ్..!

వీధి కుక్కల విరహారంతో జనం బెంబేలు





యాచారంలో ఓ ఇంటి ముందు వీధి కుక్కలు, పిచ్చి కుక్క దాడిలో గాయపడిన యువకుడు

యాచారం: వీధి కుక్కలు వీరవిహారం చేస్తున్నాయి. వాటిని చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. యాచారం మండలంలో రెండు నెలల వ్యవధిలో 80కి పైగా కేసులు నమోదవడం చూస్తుంటే పరిస్థితి తీవ్రతను అద్దం పడుతోంది. కుక్కలు కనిపిస్తే చాలు ప్రజలు భయాందోళనతో పరుగులు తీస్తున్నారు. వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని జనం కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ ప్రాంతంలో 1,500లకు పైగానే వీధి కుక్కలున్నట్లు అధికారులు అంచనా వేశారు. యాచారంలో గురువారం ఓ పిచ్చి కుక్క దొరికిన వారిని దొరికినట్లు పది మందిని తీవ్రంగా గాయపర్చడం కలకలం సృష్టించింది. మండలంలోని నందివనపర్తి, యాచారం, తమ్మలోనిగూడ, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో వందలాది పౌల్ట్రీఫాంలు ఉన్నాయి. మృతి చెందిన కోళ్లను యజమానులు సరైన జాగ్రత్తలు తీసుకోకుండానే వ్యవసాయ పొలాల్లో పడేస్తున్నారు. వాటిని తింటున్న కుక్కలు రక్తం రుచి మరిగి వీరవిహారం చేస్తున్నాయి. కోళ్ల మాంసం దొరకని సమయంలో ఆవులు, దూడలు, ఆవులు, గొర్రెలపై దాడులు చేస్తున్నాయి. ఏడాది కాలంలో వీధి కుక్కల దాడుల్లో వందలాది మూగజీవాలు మృత్యువాతకు గురైన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం కుక్కలు ప్రజలపై దాడులు చేస్తు తీవ్రంగా గాయపర్చుతున్నాయి. పౌల్ట్రీఫాంలోని కోళ్లకు పలు రకాల ఇంజక్షన్లు ఇస్తుండటం వల్ల వాటి ప్రభావంతో పిచ్చి లేస్తూ గ్రామాల్లో సంచరిస్తున్నాయి. పౌల్ట్రీ యాజమాన్యాలతో కుమ్మక్కవుతున్న పంచాయతీ కార్యదర్శులు సరైన కట్టడి చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇష్టానుసారంగా పడేస్తే చర్యలు

పౌల్ట్రీఫాంల యజమాన్యాలు మృతి చెందిన కోళ్లను ఇష్టానుసారంగా పడేస్తే చర్యలు తప్పవు. మృతి చెందిన కోళ్లను గుంతలు తీసి అందులో వేసి పూడ్చడమా.. లేదా ఇతర జాగ్రత్తలు తీసుకుని పొలాల్లో కనిపించకుండా చూసుకోవాలి. ఆయా గ్రామాల్లో ఉన్న యజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తాం. వీధి కుక్కల కట్టడిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ యాచారం

బఫర్‌జోన్‌పై అస్పష్టత!

- ఫార్మాసిటీ చుట్టూ బఫర్‌జోన్ ప్రతిపాదనపై భిన్న ప్రచారం
- యాభై మీటర్లు.. కాదు మూడు కిలోమీటర్లు.. స్పష్టత కరువు
- ఎటూ తేల్చని అధికారులు.. ఆందోళనలో రైతులు, రియల్టర్లు
- ఫార్మాసిటీ కేంద్రంగా ఇప్పటికే రూ.వేల కోట్ల పెట్టుబడులు
- పెద్ద ఎత్తున వెలుస్తున్న వెంచర్లు.. కొనుగోలుదారుల్లో అయోమయం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫార్మాసిటీ బఫర్‌జోన్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశ్రమల నుంచి వెలువడే ప్రమాదకరమైన కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఫార్మాసిటీ చుట్టూ బఫర్‌జోన్‌ను వివిధ రకాల చెట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంది. పరిశ్రమల ఏర్పాటుకు ముందే ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉన్నా .. ఇప్పటికీ గ్రీన్ జోన్‌పై అటు ప్రభుత్వంలోనూ, ఇటు అధికారుల్లోనూ స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ గ్రీన్‌జోన్ ఫార్మాసిటీ సరిహద్దుకు 50 మీటర్ల పరిధిలో విస్తరించి ఉంటుందా? లేక మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండనుందా? అనేది అస్పష్టంగా మిగిలింది. మరోవైపు ఫార్మాసిటీ సరిహద్దు చుట్టూ బఫర్‌జోన్/గ్రీన్‌జోన్ అంటూ రెండు ఊహ చిత్రాలు ప్రస్తుతం మార్కెట్లో చక్కర్లు కొడుతున్నాయి. వీటిలో ఏదీ నిజం అనే అంశంపై ఇటు రెవెన్యూ అధికారులు కానీ, అటు టీఎస్‌ఐఐసీ అధికారులు కానీ స్పష్టత ఇవ్వకపోవడంతో ఇప్పటికే ఇక్కడ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిన రియల్టర్లలో ఆందోళన మొదలైంది.

పది గ్రామాలు.. 19,333 ఎకరాలు

జిల్లాలోని యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని 10 గ్రామాల పరిధిలో 19,333 ఎకరాల భూమిని ఫార్మాసిటీ కోసం సేకరిస్తున్నారు. ఇందులో 9,133 ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉండగా, మరో 10,200 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఇప్పటికే మొత్తం 12 వేల ఎకరాల భూముల సేకరణ పూర్తయింది. ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులకు ఎక రాకు పట్టా భూమికి రూ.16 లక్షల నష్టపరిహారంతో పాటు మీర్‌ఖాన్‌పేటలో అదనంగా 120 గ జాల ఇంటి స్థలం ఇస్తుంది. తొలి విడతలో భాగంగా 9,212 ఎకరాలు అందుబాటులోకి తీసుకురావాలని భావించి, ఆ మేరకు ఇప్పటికే 6,719 ఎకరాల్లో రోడ్లు, విద్యుత్ లైన్లు, తాగునీరు, డ్రైనేజీ లైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి అభివృద్ధి పనులు చేపట్టింది. రూ.16,784 కోట్లు అవసరమని అంచనా వేసి, ఈమేరకు హడ్కో నుంచి ఇప్పటికే రూ.750 కోట్లు రుణం తీసుకుని, పనులు చేపట్టింది.

రెడ్ కేటగిరీ పరిశ్రమలే అధికం

ఫార్మాసిటీలో సుమారు వెయ్యి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 500 ఫార్మా కంపెనీలు ఇక్కడ తమ సంస్థలను నెలకొల్పేందుకు టీఎస్‌ఐఐసీకి దరఖాస్తు చేసుకున్నాయి. తొలి విడతలో 400 కంపెనీలకు భూమిని కేటాయించాలని నిర్ణయించారు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో మెజార్టీ రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలే. వీటి నుంచి వెలువడే ప్రమాదకరమైన రసాయనాలు వాతావరణంలో కలవడంతో భూమితో పాటు గాలి, నీరు కలుషితమతోంది. కాలుష్య ఉద్గారాల్లో ఎక్కువగా కేన్సర్ కారకాలు ఉంటాయి. ఫార్మాసిటీ ఉన్న గ్రామాల్లో జీవిస్తున్న వారి ఆరోగ్యంతో పాటు పశు పక్షాదుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు.

ప్రశ్నార్థకంగా గ్రామాల మనుగడ

ఫార్మాసిటీ పేరుతో యాచారం, ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, తలకొండపల్లి, కడ్తాల్‌తో పాటు నల్లగొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ మండలాల్లో పెద్ద ఎతున రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగుతోంది. ఇప్పటికే ఐదు వేల ఎకరాలకుపైగా భూముల్లో వెంచర్లు చేశారు. రియల్టర్లు ఇప్పటికే ఇక్కడ రూ.2వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం బఫర్‌జోన్ అంశం వెలుగులోకి రావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. అసలు బఫర్ జోను ఉంటుందా...? ఉంటే ఫార్మాసిటీ మధ్యలో ఉన్న గ్రామల మనుగడ ఏమిటీ..? ఆయా గ్రామాల చుట్టూ భూములు కొనుగోలు చేసిన రియల్టర్ల పరిస్థితి ఏమిటీ? ఇప్పటికే వెలిసిన వెంచర్లలోని ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏమిటి? ఈ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఇస్తారా..? ఒక వేళ ఇస్తే ఎలాంటి ఆంక్షలు పెడుతుంది..? వంటి ప్రశ్నలకు అధికారుల నుంచి సరైన సమాధానం లభించకపోవడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది.

ఫార్మాసిటీని రద్దు చేయాలి



ఇప్పటికే పోచంపల్లి, చౌటుప్పల్, వెల్మినేడు ప్రాంతాలు పూర్తిగా పారిశ్రామిక కాలుష్యంతో నిండిపోయాయి. అక్కడ కనీస పరిరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాంతమంతా కలుషితమైంది. తాజాగా ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో పెద్దెత్తున ఒకే చోట పరిశ్రమలను నెలకొల్పాలని భావిస్తుంది. మాస్టర్ ప్లానును బహిర్గతం చేయకుండా ప్రజలను మభ్యపెడుతోంది. ఫార్మాసిటీ ఒక విష నగరం. ప్రజలు దాన్ని వద్దనుకుంటున్నారు. ప్రజాభిష్టాన్ని గౌరవించి దాన్ని రద్దు చేయాలి. బఫర్‌జోన్‌పై ఇప్పటికీ ఓ స్పష్టత ఇవ్వకపోవడం దారుణం.

– దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణవేత్త

ఔషధాల తయారీ పేరుతో కాలుష్యం చిమ్మొద్దు

రసాయన పరిశ్రమల నుంచి విపరీతమైన కాలుష్యం వెలువడుతోంది. లాభాలే ప్రధానంగా పనిచేసే యజమానులు తీరా పరిశ్రమల ఏర్పాటు తర్వాత అంతర్గత ఖర్చులపై ఆంక్షలు విధిస్తుంటారు. వ్యర్థాల శుద్ధిపై పెద్దగా ఆసక్తి చూపించరు. కాలుష్య నియంత్రణ చర్యలను పూర్తిగా గాలికొదిలేస్తారు. కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలకు పూనుకుంటే నేతలు అడ్డుతగులుతుంటారు. పీసీబీ కూడా చేతులెత్తేయాల్సివస్తోంది. ఔషధాల తయారీతో ప్రాణాలు కాపాడే పేరుతో.. అనేక మంది ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు.

– డాక్టర్ కె.బాబురావు, రిటైర్డ్ సైంటిస్ట్

అదానీని అరెస్ట్ చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి ఆస్తులు పోగేసుకున్న ప్రముఖ వ్యాపారవేత్త అదానీని వెంటనే అరెస్ట్ చేసి, ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. వ్యాపార కేంద్రాల పేరుతో ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు రంగాన్ని మోసం చేసిన అదానిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎలిగంటి మధుసూదన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తానని, ప్రతి ఒక్కరి అకౌంట్లలో రూ.15 లక్షలు వేస్తానని చెప్పిన ప్రధాని మోదీ ఆ తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. ప్రజా ధనాన్ని పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రపంచ ధనవంతుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న అదానీ ఏకంగా రెండో స్థానానికి ఎగబాకడానికి మోదీ అనైతిక చర్యలే కారణమని చెప్పారు. అవినీతి, అక్రమ సంపదన పరులకు, జాతి సంపద కొల్లగొట్టే వారికి ఆయన అండగా ఉంటున్నారని ఆరోపించారు. అదాని అక్రమాలపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడానికి మోదీ ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. అదాని అక్రమాల్లో మోదీకి భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. మోదీ తన రాజకీయ, సైద్ధాంతిక ప్రత్యర్థులపై ఈడీ, సీబీఐలతో దాడి చేయిస్తూ, ఆయా ప్రభుత్వ సంస్థల అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోడీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి తీరుతారని స్పష్టం చేశారు. అటు దేశంలోనే కాకుండా ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. జిల్లాలో పార్టీ పటిష్టత కోసం నాయకులంతా కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలే టార్గెట్‌గా వచ్చే నెల నుంచి ప్రజల్లోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, కేడర్‌ను మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా సీనియర్ నేతలు శ్రీశైలం, బాల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ఏజీవర్సిటీ: ఎలాంటి నేలలైనా ఏ పంటలైనా భూసార పరీక్షలు ఎంతో అవసరమని శాస్త్రవేత్త మైలవరపు సాంబశివరావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం భూసార శాస్త్ర విభాగం, హైదరాబాద్ చాప్టర్ ఇండియాన్ సొసైటి ఆఫ్ సాయిల్ సైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూసార పరీక్షలపై ఉపాన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంతో పాటు అమెరికా ఇతర దేశాలలో వివిధ పంటలలో పోషకయాజమాన్యంలో జరుగుతున్న పరిశోధన గురించి వివరించారు. వివిధ పోషకాల పనితీరు వాటిని వివిధ రూపాలలో పంటలకు అందించే తీరును కొన్ని మూలకాలతో ఉద్భవించే సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ అనిత, అసోసియెట్ డీన్ నరేందర్‌రెడ్డి, ఇతర శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను విస్తరించాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తదితరులు

చేవెళ్ల: తెలంగాణ ప్రభుత్వం ప్రజలందరికీ కంటి సమస్యలను దూరం చేసేందుకు నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరికీ అందేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈ. వెంకటేశ్వర్‌రావు అన్నారు. చేవెళ్లలోని గ్రామ పంచాయతీ వద్ద జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ వరదాచారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కంటివెలుగు శిబిరానికి వస్తున్న ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి సమస్యలు ఎలా ఉన్నాయి. వాటిని ఎలా పరిష్కరిస్తున్నారని వైద్యసిబ్బందిని అడిగారు. కంటి సమస్యలున్నవారికి కంటి అద్దాలు అందించాలని సూచించారు. మండలకేంద్రంలో ఉన్న కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులోఉండాలని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యావిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. చేవెళ్లలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని ఆయన డీసీహెచ్‌ఎస్ వరదాచారి, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావుతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం అందిస్తామనే నమ్మకం కలిగించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్‌గౌడ్, డాక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, వైద్యులు, స్టాఫ్‌నర్సులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని వివిధ బైపీసీ కోర్సులలో నాలుగు విడుతల కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత ఆయా కోర్సులలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 25న స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ తెలిపారు.

నిర్ణీత గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయండి

- అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇబ్రహీంపట్నం రూరల్: బ్యాంకర్లకు సూచించిన నిర్దేశిత గడువులోపు లక్ష్యాలను పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ .. రాష్ట్ర రాజధానికి జిల్లా సమీపాన ఉన్నందున పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారన్నారు. అలాంటి వారికి రుణాలు సకాలంలో అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. రైతులకు బ్యాంకుల ద్వారా అందించే పంట రుణాలు సకాలంలో అందించి వారికి చేయూతనివ్వాలన్నారు. అధికారులు, బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణ వితరణ చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయొద్దని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. పీఎం స్వానిధి, పీఎంఈజీపీ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌కి సంబంధించిన అన్ని పథకాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ రావు, ఆర్‌బీఐ అధికారి, నాబార్డు ఏజీఎం శీబీ శర్మ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతా రెడ్డి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి అంజిలప్ప, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యకే పెద్దపీట



అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి

- జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి
- శ్రీదత్త కళాశాలలో అంతర్జాతీయ సదస్సు
- అధునాతన కంప్యూటర్ ప్రయోగశాల ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రయోగాత్మక విద్యనందించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపడుతుందని, ఇలాంటి చదువులకే పెద్దపీట వేయాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని శేరిగూడ శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాలలో నూతన ఆవిష్కరణలపై 2వ అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశోధనలకు ఉపయోగపడే చదువులకే ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో ప్రయోగాత్మకమైన విద్యనందించడంలో మన దేశం 49వ స్థానంలో ఉందన్నారు. దాన్ని టాప్ 10లోకి తీసుకురావడానికి అన్ని ఇంజనీరింగ్ కళాశాలలు కృషి చేయాలని సూచించారు. రోజు రోజుకూ ఆర్టిఫిషిల్ ఇంటలిజెన్స్‌కు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. అతి తక్కువ కాలంలో శ్రీదత్త కళాశాల యుజీసీ నుంచి అటానమస్ హోదా సాధించడం గర్వకారమన్నారు. కళాశాలలో వసతులు, విద్యాబోధనపై చైర్మన్ పాండురంగారెడ్డిని అభినందించారు . అనంతరం లండన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పరీన్ సోమని మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉన్నత చదువులు చదవాలన్నారు. దేశానికి ఉపయోగపడే చదువులు ఉండాలన్నారు. ఉపాధి అవకాశాల కోసం చూడకుండా పది మందికి ఉపాధి కల్పించేలా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ వైభవ్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చక్రవర్తి, సీఈఓ ప్రశాంత్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ సెండిల్ కుమార్, శ్రీనివాస్, డాక్టర్ వెంకట అమృతరావు, యశ్వంత్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పహాడీషరీఫ్: అక్రమంగా తరలిస్తున్న 13 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తుక్కుగూడ మార్కెట్ వెనుక రేషన్ బియ్యాన్ని లారీలోకి నింపుతున్నారన్న సమాచారం అందుకున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ హైదర్ అలీఖాన్ పహాడీషరీఫ్ పోలీసుల సహకారంతో గురువారం ఉదయం దాడులు నిర్వహించారు. పారిపోయేందుకు యత్నించిన జితేంద్ర నాయక్(28), ఇష్వాలాల్ సాహు(35), ఇమాన్యల్ సాహు(20),వినోద్ చౌహాన్(22), అనిల్ చౌహాన్(24), అఫ్తాబ్ ఆలం(25), షేక్ అక్తర్(27), షేక్ సిల్దార్(25), మహ్మద్ వకీల్(30), మహ్మద్ గుల్బరాజ్(30), మహ్మద్ తాజ్(30)లను అదుపులోకి తీసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నగర శివారులోని రేషన్ కార్డు లబ్ధిదారుల వద్ద కిలో రూ. 5లకు కొనుగోలు చేసి ఆదిలాబాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ యాసర్ సల్మాన్ ద్వారా కర్ణాటకలో రూ. 12కు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. మొత్తం 282 బ్యాగుల్లో 13 టన్నుల బియ్యం బస్తాలను, లారీ, తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ. 1330ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బట్టేల్‌గుట్ట.. చరిత్ర పుట్ట

- రూ. 2 కోట్లతో ఆధునికీకరణ
- ఆకట్టుకుంటున్న బుద్ధుడి విగ్రహం
- ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కు
- అందుబాటులోకి వాకింగ్ ట్రాక్



కొత్త హంగులతో బడంగ్‌పేటలోని చారిత్రక కట్టడం బట్టేల్‌గుట్ట

బడంగ్‌పేట్: బడా జంగ్‌పేట్ అంటే నైజాం సిద్ధ సైన్యం ఉండే స్థావరం అని అర్థం. చుట్టూ 30 అడుగుల ఎత్తులో కోట గోడ. మధ్యలో సిద్ధ సైన్యం. కోటగోడ కింద రాణి నివాసం. కోట గోడ మధ్యలో రెండు వేల మీటర్ల ఎత్తులో బట్టేల్‌గుట్ట బురుజు. నలుదిక్కుల నుంచి వచ్చే శత్రు సైన్యాన్ని పసిగట్టి సిద్ధ సైన్యం ఎదురు దాడి చేసేదని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. రాణి నివాసం, స్నాన ఘట్టాలు, మెట్ల బావి, సిద్ధ సైన్యం ఆనవాలు కాలానుగుణంగా కనుమరుగయ్యాయి. కానీ అక్కడక్కడ కోటగోడ ఆనవాళ్లు మాత్రం నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. నాడు బడాజంగ్‌కు సిద్ధ సైన్యాన్ని అందించిన బట్టేల్‌గుట్ట ఆలనాపాలనా చూసేవారు లేక శిథిలావస్థకు చేరుకొని ఊరి మధ్యలో విసిరేసినట్లుగా పడి ఉండేది. నేడు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కల్పించుకొని మంత్రి సబితారెడ్డి దృష్టికి తేవడంతో ఆమె సహకారంతో బట్టేల్‌గుట్టకు తిరిగి ప్రాణం పోశారు. గతంలో బడంగ్‌పేటలోని బట్టేల్‌గుట్ట నుంచి చూస్తే నగరంలోని చార్మినార్ గుమ్మటాలు కనిపించేవని స్థానికులు తెలిపారు. ఇప్పుడు కాంక్రీట్ జంగిల్ కావడం , పెద్ద పెద్ద భవంతులు ఏర్పడడంతో చార్మినార్ కనిపించడం లేదని అంటున్నారు. శిథిలమవుతున్న బట్టేల్‌గుట్టకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు, మంత్రి సబితారెడ్డి పూర్తి సహకారంతో రెండు కోట్లకు పైగా వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పచ్చని గడ్డి, రకరకాల పూలు, చుట్టూ ఇనుప కంచెతో పది అడుగుల మేర ప్రహరీ, తాజ్‌మహల్ తరహాలో ఇక్కడ కూడా పాలరాతి కట్టడాన్ని ఏర్పాటు చేశారు. గుట్టపై ధ్యాన ముద్రలో ఉన్న పెద్ద బుద్ధ భగవానుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. సందర్శకులు ఆహ్లాదాన్ని పొందేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇటీవల మంత్రి సబితారెడ్డి పార్కును ప్రారంభించారు.



వాకింగ్ ట్రాక్

మంత్రి కృషితో అభివృద్ధి



చారిత్రక ప్రాంతమైన బట్టేల్‌గుట్ట మా డివిజన్‌లో ఉండడం చాలా సంతోషం. ఈ గుట్టను అభివృద్ధి చేయాలని మంత్రి సబితారెడ్డిని కోరాం. ఆమె కృషితో రూ. 2కోట్లు మంజూరయ్యాయి. బడంగ్‌పేటకు ఒక ఐకాన్ ఉండాలని గుట్టను మున్సిపల్ లోగోగా ముద్రను ఏర్పాటు చేశారు.

– స్వప్న, 30 డివిజన్ కార్పొరేటర్

యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మినారాయణ కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల్‌కు చెందిన మంకాల రాజు ఆరు నెలల క్రితం మేనమామ కుతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భార్య శిరీష తల్లితో పాటు నగరంలోని ఆస్పత్రికి వెళ్లింది. అయితే ఇంట్లో ఎవరూలేని సమయంలో రాజు ఉరేసుకొని చనిపోయాడు. భార్య ఫోన్ చేసినా తీయకపోవడంతో పక్కింటి వారికి కాల్ చేసింది. వారు వెళ్లి ఇంట్లో చూడగా రాజు మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే రాజు మృతికి కారణాలు తెలియరాలేదు.

మహిళ ఆత్మహత్య

మొయినాబాద్: పొలం వద్ద మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని తోలుకట్ట గ్రామ శివారులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కే ఇందిర(37) వ్యవసాయ కూలి. గురువారం ఉదయం ఇంట్లో చెప్పకుండా పొలం వద్దకు వెళ్లింది. తల్లి ఇంట్లో కనిపించకపోవడంతో కూతురు మనీషా చుట్టుపక్కల వెతికింది. పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. షాద్‌నగర్, మొయినాబాద్ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మీర్‌పేట ఘటనలో ఆశా వర్కర్లు తీవ్రంగా గాయపడ్డారు.



మొయినాబాద్: మల్లయ్య మృతదేహం



ప్రమాదం జరిగిన ప్రాంతం వద్ద క్షతగాత్రులు

షాద్‌నగర్ రూరల్: బస్సును స్కూటీ ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం గేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ దేవకి కథనం ప్రకారం.. నగరంలోని లింగంపల్లికి చెందిన లక్ష్మీకాంత్(48) తన కుమారుడు ప్రణయ్‌తో కలిసి స్కూటీపై మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న బంధువుల వివాహ వేడుకలకు బయలుదేరాడు. అన్నారం గేట్ వద్ద జడ్చర్ల వైపు వెళుతున్న ప్రైవేట్ బస్సును డ్రైవర్ ఇండికేటర్ వేయకుండా ఒక్కసారిగా ఆపి వెనక్కు తీసుకుంటున్న క్రమంలో వెనక నుంచి వచ్చిన స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న లక్ష్మీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రణయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఉస్మానియాకు తరలించారు. ఎస్‌ఐ దేవకి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి బంధువు జశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మొయినాబాద్: పొలం నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని వెనుకనుంచి బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై లింగ్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ముర్తూజగూడ గ్రామానికి చెందిన కన్నయ్యగారి మల్లయ్య(70) బుధవారం రాత్రి పొలం వద్ద నుంచి ఇంటికి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి గోవర్ధన్ బైక్‌పై వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్య సిబ్బందికి గాయాలు

మీర్‌పేట: వైద్య సిబ్బంది ప్రయాణిస్తున్న ఆటోకు బ్రేకులు ఫెయిల్ కావడంతో ఇద్దరు ఆశా వర్కర్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంఆర్ సర్వే నిమిత్తం గురువారం మీర్‌పేట పీహెచ్‌సీ నుంచి ఏడుగురు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశా వర్కర్లు జల్‌పల్లి షాహీన్‌నగర్‌కు ఆటోలో బయలుదేరారు. రోడ్డంతా గుంతలమయంగా ఉండడంతో పాటు స్పీడ్ బ్రేకర్ రాగానే ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేశాడు. దీంతో బ్రేకులు ఫెయిల్ అయ్యి ఆటో పైభాగంలోని ఇనుప రాడ్లు తలకు బలంగా తగలడంతో ఇద్దరు ఆశా వర్కర్లు కవిత, సుమలతకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని జిల్లా ఉప వైద్యాధికారి డా. గీత పరామర్శించారు. అయితే కవిత, సుమలత పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కవితకు కొన్నేళ్ల క్రితం మెదడుకు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. ఆమె తల భాగంలో బలమైన గాయం కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సిబ్బంది ద్వారా తెలిసింది. అయితే ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పినా వైద్యాధికారులు సమయానికి స్పందించలేదని క్షతగాత్రులు తెలిపారు. కంటి వెలుగుకు సంబంధించి 5 వాహనాలు ఉన్నా తమను ప్రైవేటు వాహనాల్లో సర్వే కోసం పంపారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్‌నెట్ కేబుల్ సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ఇబ్రహీంపట్నంలోని మహంకాలమ్మ ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చింతపల్లిగూడకు చెందిన జోగు ప్రశాంత్ కొంత కాలంగా ఇంటర్‌నెట్ కేబుల్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఇబ్రహీంపట్నంలోని మహంకాళి ఆలయం సమీపంలో ఇంటర్‌నెట్ వైర్లు సరి చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో స్తంభం పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

హక్కులపై అవగాహన తప్పనిసరి

అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

షాద్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ శివారులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హక్కుల సాధనకు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సైబర్ నేరగాళ్లు సెల్ ఫోన్లలో యాప్‌లను తయారు చేసుకొని రుణాల పేరిట మోసం చేస్తున్నారని తెలిపారు. లోన్‌యాప్ ద్వారా ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పట్టణానికి చెందిన న్యాయవాది రాందాస్‌ను అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర న్యాయ సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాదులు గంతలశివయ్య, వేణుగోపాల్, బెన్నూరి చంద్రయ్య, గంతల నాగరాజు, రాజశేఖర్‌రాజు, శ్రీనివాస్, రామస్వామి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారులు



800 మీటర్ల పరుగు పందెంలో క్రీడాకారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ముగిసిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్

జిల్లా స్థాయి అండర్ – 16, –18 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు సరూర్‌నగర్ స్టేడియంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ఈ పోటీలు ముగియనున్నాయి. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 25, 26న వరంగల్ హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. 400 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్ లాంగ్‌జంప్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గోపి, శిక్షకులు సాయిరెడ్డి తెలిపారు. – హుడాకాంప్లెక్స్





400 మీటర్స్ రన్నింగ్‌లో బాలికలు

చెరువులో పడి మహిళ మృతి



శాంత మృతదేహం

మీర్‌పేట: మతిస్థిమితం లేని మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఉదయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. భూపేష్‌గుప్తా నగర్‌కు చెందిన శాంత(45) వృత్తి బట్టల వ్యాపారం. గురువారం సాయంత్రం శాంత జిల్లెలగూడ చందన చెరువులో పడి మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.